# అబల - అనుమానం

సమాజంలో స్త్రీలు నాగరికంగా ఎంతగానో పురోగమించి వాళ్ళలో వాళ్ళే గర్వపడుతున్న రోజులివి: పురుషుడు సాధించిన ప్రతి దానిని తాను సాధిస్తూ స్త్రీ, పురుషునితో పాటు అన్ని రంగాలలో ప్రావిణ్యం సంపాదించవచ్చు, కాని నిత్య జీవితంలో జరిగే కొన్ని సంఘటనలు స్త్రీకి పురుషుడు అందలేని లోటును చిత్రంగా రుజువు చేసాయి;

నేనేదో స్త్రీల మీద వ్యాసం రాస్తున్నాననుకునేరు! ఆలాగని స్త్రీలమీద నాకు ఎటువంటి చులకన భావం లేదు, కాని పై విషయాన్ని రుజువు చేసిన సంఘటన ఒకటి జరిగింది కాబట్టి వ్రాస్తున్నాను.

ఒక రోజు నేనూ, నా మిత్రుడు గోపి కలిసి ఆ రోజే రిలీజయిన ఎదో పిక్చరు సెకండ్ షో చూడ్డాని కెళ్ళాము. సినిమా ఆ రోజే విడుదల కావడం మూలాన రష్ ఎక్కువగావుంది. అసలు టికెట్లు దొరకవు అనుకున్నాను నేను. కాని మా గోపి అఖండుడు. వాడికి సినిమాలంటె చెడ్డ పిచ్చి. థియేటర్ వద్దకొచ్చి వెళ్ళిపోవడమంటె వాడూ సహించను.

ఎలా సాధించాడో గాని మావాడు చూస్తుండగానె రెండు టికెట్లు సంపాదించి తెచ్చాడు, అంత పబ్లిక్ వుండగా ఎలా సంపాదించావురా అని నేను ఆశ్చర్యంగా ప్రశ్నిస్తె అది నాకు మామూలె అన్నట్టుగా వాడు చిన్నగా నవ్వేచాడు. ఇరువురం థియేటర్‌లో ప్రవేశించి ఓమూల కూర్చున్నాం.

పిక్చరు బిగిన్ అయింది. హాలంతా నిశ్శబ్దంగా తెర వైపె చూస్తున్నారు. మేము కూడా దీక్షగా చూడ నారంభించాం.

విశ్రాంతి తర్వాత ఆట నడిచె సమయంలో యథాలాపంగా నేనొక సారి వెను దిరిగి చూసి అదిరి పడ్డాను. పంచ ప్రాణాలు ఎగిరి పోయాయ్. ఫాన్ క్రింద కూర్చున్నా వొళ్ళంతా చెమట పట్ట నారంభించింది. వెనక వరుస సీట్‌లో మా హాస్టల్ వార్డెన్ కూర్చుని యున్నాడు. ఆయన యమకింకరుడు. దొంగతనంగా హాస్టల్‌లో నుండి పిక్చర్లకూ, వగైరాలకూ చెక్కేసె వాళ్ళంటె ఆయనకు భరింపరాని కోపం. ఇప్పుడు మేము ఆయన కళ్ళ పడ్డామా ఇకసరి, చివాట్లతో మొహం వాయగొడతాడు.

'విద్యార్థుల విధులు' అనే శీర్షిక మీద ఆగకుండా అరగంట స్పీచ్ (థియేటర్లోనె) దంచి పారేసి 'ఫస్ట్ వార్నింగ్' అంటూ విడిచి పెడ్తాడు.

'ఛఛ వెధవ ఈ గోపిగాడివల్లె నేను పిక్చరుకు రావడం తటస్థించింది, వద్దురా! వార్డెన్ చూస్తె కొంప మునుగుతుంది అంటె వినకుండా బలవంతంగా లాక్కొచ్చాడు'. నిజంగా నా కాక్షణంలో మా గోపి మీద భలే కోపమొచ్చింది, పిక్చరు చూడటంలో పూర్తిగా లీనమైన వాణ్ణి ఒక్క పోటు పొడిచాను.

'ఏమిట్రా' అంటూ వాడు నా వైపు తిరిగాడు, నేను మౌనంగా వాడికి వార్డెన్‌ను చూపెట్టాను.

వార్డెన్‌ను చూడగానే గోపి గుండెల్లో రైళ్లు పరిగెత్తాయనే చెప్పాలి. మరి మా వార్డెన్ అంటె స్టూడెంట్లు అందరికి భయమె.

ఎలాగో ఆట అయ్యేంతవరకూ గప్‌చుప్‌గా సీట్లలో వొదిగి కూర్చున్నాము. సినిమా సంగతి దేవుడెరుగు ముందు ఆ మహానుభావునికి కనిపిస్తె డేంజర్.

జనగణమన కాక ముందె థియేటర్‌లోంచి బయట పడ్డాము. పెద్దపెద్ద అంగలు వేస్తూ రోడ్డమ్మట దూసుకు పోతున్నాము, సెకండ్‌షో కావటం మూలాన రోడ్డన్ని నిర్మానుష్యంగా వున్నాయ్.

మాకు కొద్దిదూరములో ఒక స్త్రీ ఐదు ఆరు సంవత్సరాల వయస్సుగల పిల్లవాడితో నడచివెళ్తోంది.. వార్డెన్‌ను గురించిన భయం తాలూకూ అదుర్దాలోవున్న మేము మహాదూకుడుగా నడుస్తూ ఆమెను సమీపించాము.

ఆ స్త్రీ మమ్ము చూసింది మా నడక చూసి అనుమాన పడింది కాబోలు వున్నట్టుండి 'ఒరె నానీ! మీ నాన్న గారు వెనుక బడ్డారులా వుంది ఆయన వచ్చేంతవరకూ ఆగుదామా?' అని అంది పిల్లవాడితో.

దానికా పిల్లవాడు ఆశ్చర్యపడ్డట్టుగా ఆగి 'నాన్న గారు సినిమా కెందుకొచ్చారమ్మా ప్రొద్దునే ఊరి కెళ్ళాడుగా' అన్నాడు.

ఆ పిల్లవాడు మాటలకు ఆమె మెల్లగా ఎదో గొణుక్కుంది. రోడ్డు ప్రక్కన ఒదిగి వొదిగి నడక నారంభించింది. మేము వారిని దాటేసి వెళ్ళిపోతూ ఆ మాటలు విన్నాం. ఆ అబల అవస్థకు నవ్వుతో పాటు మాకు జాలి వేసింది.

ఆమె వొంటరిగా వుంది కాబట్టి మేమేదైనా అఘాయిత్యం చేస్తామనుకొంది కాబోలు అలా మాట్లాడింది.

మరునాడు క్లాసులో మా గోపి ఈ విషయం అందరికీ చెప్పేశాడు. ఆ సంఘటన విన్న మా క్లాస్ విద్యార్థులంతా తలో వ్యాఖ్యానం చేస్తూ ఒకటే నవ్వు ప్రారంభించారు.

కాని నాకు మాత్రం చాలా బాధనిపించింది. అర్ధరాత్రి నిర్మానుష్యమైన వీధిలో ఒంటరిగా ఉన్న స్త్రీ అలా భయపడడంలో ఆశ్చర్యం లేదు.

ప్రకృతి సిద్ధంగా ఆ జంకు స్త్రీలో వుంది. ఎప్పుడూ వుంటుంది కూడా.

—శ్రీ ఎ. ఎస్. అయోధ్యా రెడ్డి.